ఆర్‌టిసి కార్మికులు అధైర్యపడొద్దు

చర్చలకు ప్రభుత్వం సిద్ధం: ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/యాదాద్రి : ఆర్టీసీ ఉద్యోగులు ఎవరూ అధైర్యపడకూడదని, ప్రభుత్వం వారితో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగి శంకర్ గౌడ్ మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు ఎంతో విలువైనవని, మన వెనుక మన కుటుంబ సభ్యులు ఉన్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రజలు ఎన్నుకున్న ఈ ప్రభుత్వం 'ప్రజా పాలన' కోసం నిరంతరం శ్రమిస్తుందని, గతంలో మాదిరిగా నెలల తరబడి చర్చలను సాగదీయకుండా సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఎంపీ తెలిపారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వారి మాటలు నమ్మి ఉద్యోగులు ఆవేశపడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కార్మికులు తక్షణమే సమ్మె విరమించి ప్రభుత్వంతో చర్చల్లో పాల్గొనాలని, తద్వారా సమస్యల పరిష్కారానికి సహకరించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

అదనపు లారీలను ఏర్పాటు చేస్తాం

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

ప్రజాపక్షం/చందూరు : కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యం ఒకే మిల్లు ద్వారా కొనుగోలు జరుగుతుండటంతో ఆలస్యమవుతోందని మరిన్ని మిల్లులను కేటాయించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తహసీల్దార్‌కు సూచించారు. సమీప మిల్లులకు ధాన్యాన్ని ట్యాగ్ చేసి త్వరగా తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.శుక్రవారం చందూరు మండలంలోని చామలపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్రాల్లో లారీల కొరత ఉన్నట్లు గుర్తించిన ఆయన వెంటనే అదనపు లారీలు ఏర్పాటు చేసి ధాన్యం రవాణాను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చామలపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గ్రామంలోని శేషులేటి ఫీడర్ వాగుకు సంబంధించిన నష్టపరిహారం ఇప్పటివరకు అందలేదని,భూముల సర్వే చేసినప్పటికీ పరిహారం చెల్లించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరారు.దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో చందూరు ఆర్డీవో శ్రీదేవి,తహసీల్దార్ రవికాంత్ వర్మ,ఎంపీడీవో బి.యాదగిరి,ఉపసర్పంచ్ వెంకన్న,సెంట్రల్ నిర్వాహకులు జ్వాలా వెంకన్న,ఏవో చరిత్ర,ఏఈఓ శోభ, ఆర్ఐ లక్ష్మిఉన్నారు.

ధాన్యం దిగుమతిలో జాప్యం వద్దు

ప్రజాపక్షం/చిట్యాల: లారీల ద్వారా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు నల్లగొండ ఆర్డీవో వై అశోక్ రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా చిట్యాల తహసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డితో కలిసి మిల్లర్లు, లారీ యజమానులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 15 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రోజుకు 54 లారీల ధాన్యం మిల్లులకు ఎగుమతి అవుతుందని ఏ రోజు లారీని ఆరోజే దిగుమతి అయ్యేలా మిల్లర్లు కావల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం ఎగుమతికి గాను లారీల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు, లారీ యజమానుల సహకారం ఉంటే రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని, ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి జాప్యానికి తావుండదని, అందరూ సమన్వయంతో పనిచేయాలని అశోక్‌రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో స్థానిక తహసిల్దార్ విజయ్ కుమార్, మిల్లర్లు పందిరి శ్రీనివాసులు, తేరటుపల్లి హనుమంతు, వేలుపల్లి శంకరయ్య, వేలుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/ఆత్మకూరు(ఎం) : మండలంలోని కోరటికల్ గ్రామంలో మద్యపాన నిషేధం అమలుకు కోసం గ్రామ యువకులు గ్రామ సభలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామ సర్పంచ్ కట్టికోల సుశీల హనుమంతు గౌడ్, నూతన పాలకవర్గం గ్రామ సభ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పాలక వర్గం హెచ్చరించింది. ఏప్రిల్ 27వ తేదీ నుండి గ్రామంలో మద్యపాన నిషేధం అమలులోకి వస్తుందని, ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. మద్యం అమ్మే వారికి గ్రామ పంచాయతీ నుండి సమాచారం పంపడం జరుగుతుందని తెలిపారు. అయినా అమ్ముతున్నారని సమాచారం ఇచ్చిన వారికి రూ.5000 ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందనీ, అమ్మిన వారికి రూ.20 వేలు జరిమానా, కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉప సర్పంచ్ మామిడి నర్సిరెడ్డి, రాగటి యాదగిరి, వెలిమినేటి మహేష్, నాగరాజు, శ్రీరాముల లావణ్య, జోగు రామ నర్సమ్మ, చిన్నం యాదగిరి, దివ్య, జక్కరాజలక్ష్మి, మధుగాని పాండు పాల్గొన్నారు.

బొల్లనపల్లి నర్సరీ నిర్వహణపై అసంతృప్తి

ప్రజాపక్షం/డిండి; డిండి మండలంలోని కందుకూరు, బొల్లనపల్లి గ్రామాల్లో శుక్రవారం వన నర్సరీలను జిల్లా డిఆర్డివో పిడి శేఖర్‌రెడ్డి పరిశీలించారు. కందుకూరు వన నర్సరీలను పరిశీలించిన పిడి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బొల్లనపల్లి గ్రామంలోని వన నర్సరీని పరిశీలించారు. నర్సరీ ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బొల్లనపల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో పిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయం 6 నుండి 11 గంటల వరకు పని సమయంలో పనిచేయాలని పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పిడి వెంట ఎంపిడివో వెంకన్న, ఏపివో శ్రీనివాస్, ఏపిఎం విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే వరకూ ఉద్యమం

హామీలను మరిచిన రాష్ట్ర ప్రభుత్వం
సమ్మెకు ఎఐటియుసి, సిఐటియు, బిఆర్ఎస్ కార్మిక విభాగం మద్దతు

ప్రజాపక్షం/కోదాడ: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దాక ఉద్యమం కొనసాగుతుందని ఆర్టీసీ కార్మిక నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారంకోదాడ డిపో ఆవరణలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. బస్సులు డిపో నుంచి బయటకు రాకుండా నల్ల బ్యాడ్జిలు ధరించి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. తాత్కాలిక ఉద్యోగులతో బస్సులు నడపడంతో ప్రయాణికులు భద్రత కరువైందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సమ్మె ఉధృతం అయిందని, సమస్యలు పరిష్కరించే దాక వెనక కు తగ్గేదేలేదన్నారు. ప్రభుత్వం చర్చలు చేయకపోవడంతో మనస్థాపం చెందిన డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్యయత్నానికి పాల్పడి మృతి చెందాడని, మరో ఇద్దరిది ఇదే పరిస్థితి అని తక్షణమే సమస్యల పరిష్కారానికి జరుగుతున్న చర్చలకు మంత్రులు సఫలం చేయాలన్నారు. కాగా సమ్మెకు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మేకల శ్రీనివాసరావు, ముత్యాలు, రాంబాబు, ఎస్‌కె నయీం, రావెళ్ల సీతరామయ్య, వేనేపల్లి శ్రీనివాసరావులు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. మృతిచెందిన డ్రైవర్ శంకర్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, అబ్దుల్, ఉప్పలయ్య, రాజశేఖర్, కెవిరత్నం, ఎస్ఎస్‌రావు, అంజలి, జ్యోతి, చుక్కమ్మ, శ్రీదేవి, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో సమ్మెకు సంఘీభావం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆర్టీసీ కార్మికుల సమస్యలను సర్కార్ సత్వరమే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మాజీ శాసనసభ్యులు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దబ్బికార్ మల్లేష్, ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకుడు వస్కుల మట్టయ్యలు డిమాండ్ చేశారు. న్యాయ సమ్మతమైన సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం మూడవ రోజుకు చేరుకుంది. సమ్మెకు సంఘీభావం తెలిపి డిపో ప్రధాన గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ సమ్మెపై 41 రోజుల ముందుగానే కార్మికులు నోటీసులు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు యడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, అంజనపల్లి రామలింగం, సాలె జగన్, ఈశ్వరచారి, పోతుగంటి కాశీ, కిరణ్, ఆర్టీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నల్లగొండలో డిపోల ముందు మౌన ప్రదర్శనలు

ప్రజాపక్షం/నల్లగొండ: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని,ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది.సమ్మెలో భాగంగా నల్లగొండ పట్టణంలోని డిపోల ముందు కార్మికులు మౌన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,ఆలస్యం చేస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి, జేఏసీ నాయకులతో చర్చలు జరపాలని నాయకులు కోరారు. ఉద్యోగ భద్రత,పెండింగ్ సమస్యల పరిష్కారం, హామీల అమలు కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు బి సరేందర్,యార చంద్రయ్య, బాసాని వెంకటయ్య, కేఎస్ రెడ్డి, జల్లా వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు టీజే రావు,ఎన్‌ఆర్‌సీ రాజు,మీలా ప్రభాకర్, కేఎల్ నాయక్, డిపో నాయకులు ఈఎస్ రెడ్డి, ఏఎల్ స్వామి, వీఎస్ రెడ్డి, బీఆర్ లింగం, ఎండీ అన్వర్, ఎండీ సాధిక్ పాషా, బి శివకుమార్, బిశంకరమ్మతో పాటు కార్మిక సోదర,సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యాపేట ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి సహకారం

ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హామీ

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి సహకారమందిస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రెస్‌క్లబ్ స్వంత భవనం నిర్మించుకోవడం వల్ల జర్నలిస్టులకే కాకుండా ప్రజలకు కూడా ఒక వేదికగా ఉంటుందన్నారు. సమస్య ఉన్న ప్రతి ఒక్కరు అక్కడికి వచ్చి చెప్పుకోవడంతో మీడియాలో ప్రచురితం అవడంతో న్యాయం జరుగుతుందన్నారు. శుక్రవారం నూతనంగా ఎన్నికైన సూర్యాపేట ప్రెస్‌క్లబ్ కార్యవర్గం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి రావడం శుభసూచకమన్నారు. మీడియా అంటే సమాజంలో ఎంతో గౌరవం ఉందని దానిని కాపాడాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. తన తండ్రి దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 2013లో శాసనసభ్యునిగా ఉన్నప్పుడు 136 మంది జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి ఇండ్ల స్థలాలు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. నూతనంగా వచ్చిన అర్హులైన వారికి కూడా ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆనాడే ప్రెస్‌క్లబ్ స్థలాన్ని దాత సహకారంతో సమకూర్చుకోవడం జరిగిందని చెప్పారు. మీడియాపట్ల తమకు మొదటి నుంచి ఎంతో గౌరవం ఉందని తప్పు చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల మీద నిర్భయంగా వార్తలు రాయాలన్నారు. పెయిడ్ న్యూస్‌కు ప్రధాన్యత ఇచ్చి విలువలు దిగజార్చుకోవద్దని హితవు పలికారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఆయనను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వజ్జె వీరయ్య యాదవ్, కోశాధికారి తల్లాడ చందన్, గౌరవ సలహాదారులు తోట నర్సయ్య, వర్ధెల్లి కృష్ణ, బంటు కృష్ణ, ఎన్నికల కమిటి సభ్యులు బొజ్జ ఎడ్వర్డ్, బుక్క రాంబాబు, సురేష్, జర్నలిస్టులు శ్యాంసుందర్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, చెంచెల లక్ష్మణ్, బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఘనత పిఆర్‌టియుదే

ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించిన ఘనత పిఆర్‌టియు సంఘానికే దక్కిందని శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పసునూరి వెంకట్రాంరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగుల వయోపరిమితి పెంపు, మెరుగైన పిఆర్‌సి, పదోన్నతులు, బదిలీలు పిఆర్‌టియు సంఘం చేసిన కృషి మూలంగానే సాధ్యమైందన్నారు. పంచాయితీరాజ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉద్యోగులతోపాటుగా అన్ని సౌకర్యాలు కల్పించిన ఘనత పిఆర్‌టియు సంఘానికే దక్కిందన్నారు. రాబోయే కాలంలో మంచి పిఆర్‌సి ఇప్పించడంతోపాటుగా జూలై మాసంలో బదిలీలు జరిపించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హెల్త్‌కార్డులు మంజూరు ప్రక్రియ కొలిక్కి వచ్చిందని నెల రోజుల్లోనే ఉపాధ్యాయులందరికి నగదు రహిత హెల్త్‌కార్డులు మంజూరు కానున్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లుల విడుదల కోసం రెండు విడుతల్లో మొత్తం క్లియర్ అయ్యేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సమాజంలో అన్ని వృతులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యారంగం బాగుపడాలంటే అది ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పడంతోపాటుగా సమాజంలో మంచి మార్పుకు కృషి చేయాలని కోరారు. పిఆర్‌టియు సంఘానికి అదేవిధంగా ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి తాను ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు పందిరి విష్ణుకుమార్, బాణాల శ్రీనివాసరెడ్డి, పప్పుల వీరబాబు, కందుకూరి శివశంకర్, షరీఫ్ ఉన్నేసాబేగం పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం
జిల్లాలో ఎక్కడైనా పర్మిషన్ లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే సంబంధిత వాహనాలను తక్షణమే సీజ్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలో అక్రమ ఇసుక, చెరువుల మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పి సంయుక్తంగా ఆర్‌డిఓలు,తహసిల్దారులు డిఎస్పిలు,ఎంపీడీవోలు, ఎస్ఎస్‌వోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా పర్మిషన్ లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే సంబంధిత వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. చెరువుల నుండి మట్టి తీస్తే కూడా అనుమతి లేకుండా చేస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అవసరాల కోసం మట్టి తీసుకోవాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు.అనేశ్వరం గుట్ట చెరువు, కనగల్లు తిమ్మన్నగూడెం చెరువుల వద్ద అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వ నిబంధనల ప్రకారం,రవాణాతో అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.అలాగే వేములపల్లి మండలం బొమ్మకల్లు,రావులపెంట ప్రాంతాల్లో కొత్తగా రెండు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.దేవరకొండలో కూడా ఇసుక రీచ్ అవసరాన్ని పరిశీలించి ఏర్పాటు చేయాలని తెలిపారు.జిల్లా ఎస్పి శరత్‌చంద్ర పవర్ మాట్లాడుతూ అక్రమ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు.ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా లేదా మట్టి తవ్వకాలు కనిపిస్తే వెంటనే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సంబంధిత వాహనాలను సీజ్ చేసి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవిన్యూ అదనపుకలెక్టర్ జె శ్రీనివాస్. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. మైనింగ్ జిల్లా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసాధ్యమనుకున్న కేసుల్లోనూ అవయవాల పునరుద్ధరణ



ప్రజాపక్షం/సూర్యాపేట : అసాధ్యమనుకున్న కేసుల్లోను అవయవాల పునరుద్ధరణ హైదరాబాద్‌లో సోమాజిగూడ యశోద హాస్పటల్‌లో రోబోటిక్ టెక్నాలజీతో లింబ్‌సాల్వేజ్ చికిత్స చేయడం జరుగుతుందని సీనియర్ కన్సల్టెంట్ ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్, స్పోర్ట్స్ ఆర్థ్రోస్కోపి, ఇలిజరోవ్, కైఫోస్కోలియోసిస్, ఎండోస్కోపిక్ స్పైనల్, పిడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం తెలిపారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాల వల్ల తొలగించాల్సిన అవయవాలను కూడా రోబో టెక్నాలజీతో వాటిని కాపాడవచ్చని, సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఆర్థోపెడిక్ సర్జరీ రంగం పూర్తిగా మారిందన్నారు. రోడ్డు ప్రమాదంలో విరిగిన ఏ అవయవమైనా, అరిగిపోయిన కీళ్ళు అయినా, వెన్నుముక్క సమస్యలైనా అల్ట్రా మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్స అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. చిన్నపాటి కోత ద్వారా జరిగే ఈ సర్జరీ వల్ల రోగులకు శస్త్ర చికిత్స జరిగిన కొన్ని గంటల్లోనే నడవగలుగుతారని చెప్పారు. ఇది వృద్ధులకు, ఇతర రోగ సమస్యలు ఉన్నవారికి కూడా ఎంతో సురక్షితమన్నారు. రోబోటిక్, ఎండోస్కోపిక్ పద్ధతుల వల్ల పెషంట్లు వేగంగా కోల్కోవడమే కాకుండా వారి సాధారణ జీవితాన్ని త్వరలో ప్రారంభించగలుగుతారని చెప్పారు. యశోద హాస్పటల్ ఆర్థోపెడిక్ విభాగంలో 24/7 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం, ఆధునిక రోబోటిక్ సూట్లు, 3డి డయాగ్నోస్టిక్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. శస్త్ర చికిత్స తర్వాత రోగికి ఫిజియోథెరపి, పునరావాస సేవలు కూడా ప్రత్యేకంగా అందిస్తామన్నారు. ఇతర వివరాల కోసం అసిస్టెంట్ మేనేజర్ యం. రాంప్రకాష్ సెల్ 9866773492, హెల్ప్ డెస్క్ +91 40 4567 4567 సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్ పరమేష్ ,అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ పాల్గొన్నారు.

బడి ఆస్తులకు బాధ్యులు ఎవరు?

తలలు పట్టుకుంటున్న హెడ్మాస్టర్లు

ప్రజాపక్షం/అనంతగిరి: ప్రభుత్వం ఈనెల 24 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. ఈనెల 23న చివరి రోజు పని దినం కావడంతో 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఫలితాలను ప్రకటించి విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి ప్రగతి పత్రాలను అందజేశారు. జూన్ 11వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లో బడి ఆస్తులు జాగ్రత్త అంటూ పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్, డిఈవోలకు తాజాగా అదేశాలు జారీ చేశారు. ఊడహరణకు అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సుమారు 20 కంప్యూటర్లు దొంగతనం జరిగి 5 సంవత్సరాలు కావస్తున్న ఇంత వరకు వాటిని రికవరి చేయలేదని, నడిగూడెం మండలం త్రిపురవరం, రత్నవరం పాఠశాలలో హెడ్మాష్టర్లు, ప్రిన్సిపాల్స్, కెజిబివి అధికారుల్లో గుబులు రేపుతొందన్నారు. బోధనేతర సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలల్లోని ఆస్తులను కాపాడే దేలా అని తలలు పట్టుకుంటన్నారు. వేసవి సెలవుల సందర్భంగా పాఠశాలల్లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో విలువైన వస్తువులు, పరికరాలు కాపాడంపై ఆందోళన చెందుతున్నారు. సర్కారు బడులలో అన్ని పరికరాలు వస్తువులు సెలవు రోజుల్లో జాగ్రత్తగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్ నియమకాలు చేపట్టలేదని, దీంతో విలువైన పరికరాలు సెలవుల్లో ఎంత వరకు భద్రంగా ఉంటాయన్నది ప్రశ్నార్థకమన్నారు. పలుచోట్ల ఉన్నత పాఠశాలల గ్రామ శివారులో ఉన్నాయన్నారు. ప్రతి పాఠశాలకు రాత్రిపూట కాపాలదారులను ప్రభుత్వమే నియమించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.